క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏవో

దహెగాం: మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో రామకృష్ణ మాట్లాడుతూ రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, లావణ్య, ఫర్టిలైజర్ దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బుల్లితెర దర్శక నిర్మాత దండ నాయకుల సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాలదీక్ష పరుల ఆహ్వానం మేరకు మంగళవారం భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సురేశ్‌కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, పిన్న వివేక్, గడ్డల వెంకటేశ్, సుధాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని అనార్‌పల్లి గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. నానాటికీ పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రతిరోజు మూడుసార్లు నీరు పట్టాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: మండలంలోని చిర్రకుంట, మాలన్‌గొంది, తుంపల్లి, కోసార, పాడిబండ గ్రామ పంచాయతీల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఊర్మిళ ఒక ప్రకటనలో తెలిపారు. చిర్రకుంట 11కేవీ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

అంజన్న స్వాములకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న స్వాములు

కెరమెరి: మండలంలోని బాజీరుగి (మహరాజ్‌గూడ) గ్రామంలో మంగళవారం ఆంజనేయ దీక్ష స్వీకరించిన స్వాములకు రాథోడ్ గోపాల్ అన్నదానం నిర్వహించారు. అంతకుముందు రాథోడ్ గోపాల్ ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో సుమారు 60 మంది భక్తులు అంజన్న దీక్షను స్వీకరించారు. స్వాములు గుర్నూలే బాలాజీ, రాథోడ్ గోపాల్, కొట్రంగే తిరుపతి, రాథోడ్ విక్రమ్, కొలిపాక సంతోష్, సెండే తిరుపతి, గుజ్జుల బాలాజి తదితరులు ఉన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కౌటాల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం ఆలయ 9వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య మంగళవారం తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నేడు ఉదయం 7.30 గంటలకు సాయినాథుని విగ్రహానికి అభిషేకం, 9 గంటలకు మార్కెట్ కాలనీ నుంచి ఆలయం వరకు పల్లకిసేవ ఉంటుందన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని, మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఠాణాలో పుస్తక పఠనం

- లైబ్రరీగా పాత పోలీస్‌స్టేషన్
- మండలవాసులకు ఉపయోగకరం
- వచ్చేనెలలో ప్రారంభించే అవకాశం



ముస్తాబు చేసిన పాత పోలీస్‌స్టేషన్ భవనం

తిర్యాణి: ఒకప్పుడు పోలీసులు అంటే కేవలం శాంతిభద్రతలు కాపాడే వరకు మాత్రమే విధి నిర్వహణ ఉండేది. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారు. మండలంలో దాదాపు గత ఏడేళ్ల క్రితం నుంచి అప్పటి ఎస్సై పుష్పాల రామారావు నుంచి మొదలుకొని ప్రస్తుత ఎస్సై శ్రీకాంత్ వరకు నిత్యం ఏదో ఒక రూపంలో ప్రజలకు అవసరమయ్యే పనులు చేపడుతూ అండగా నిలుస్తున్నారు. తాజాగా మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనంలో గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

గ్రంథాలయం కరువు..

అత్యంత వెనుకబడిన తిర్యాణి మండలంలో నేటికీ లైబ్రరీ లేకపోవడంతో అటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారితో పాటు పుస్తక పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని గుర్తించిన ఎస్సై శ్రీకాంత్ మండలంలో ఎలాగైనా గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఏఎస్పీ చిత్తరంజన్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వారి సహకారంతో గ్రంథాలయం ఏర్పాటుకు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నిరుపయోగంగా ఉన్న పాత పోలీసుస్టేషన్ భవనంలో పలు మరమ్మతు పనులు నిర్వహించడంతో పాటుగా రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలపై దృష్టి..

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గ్రంథాలయంలో రానున్న జాబ్ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంచనున్నారు. తద్వారా నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. వార్తపత్రికలతో పాటు కథలు, నవలా పుస్తకాలను అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు వచ్చేనెల మొదటి వారంలోనే గ్రంథాలయాన్ని ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పోలీసుశాఖ నిర్వహించే గ్రంథాలయం నిర్వహణ ఖర్చును పూర్తిగా పోలీసు శాఖ అధికారులే భరించనున్నారు.

నిరుద్యోగులకు మేలు



మండల కేంద్రంలో పోలీస్ శాఖ గ్రంథాలయం ఏర్పాటు చేయాలనుకోవడం శుభపరిణామం. ప్రస్తుతం మండలంలో లైబ్రరీ లేక ఉద్యోగ నోటిఫికేషన్లకు ప్రిపేర్ కావడం చాలా కష్టంగా ఉంటుంది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలి.

– మ్యాన రాజు, నిరుద్యోగి, తిర్యాణి

వచ్చేనెలలో ప్రారంభిస్తాం



మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే గ్రంథాలయాన్ని వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రారంభిస్తాం. నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉండే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచుతాం. యువకులు, మండలవాసులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీకాంత్, ఎస్సై

ఏఐతో విద్యార్థులకు మెరుగైన విద్య



కౌటాల: ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ఏఐ సహాయంతో చదువులో వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని బోదంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కృత్రిమ మేథ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మెరుగైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. హెచ్‌ఎం అరుణ్, చౌహాన్ శైలజ, వీవో కొండ కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థులకు మేలు

పెంచికల్‌పేట్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు అన్నారు. మండలంలోని చెడ్వాయి ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఆల్బర్ట్‌తో కలిసి మంగళవారం ఏఐ ల్యాబ్ ప్రారంభించారు. వెనుకబడిన విద్యార్థులకు ఏఐ ద్వారా బోధించి వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్ బాబు, డీఈ భద్రయ్య, జిరు రాకేశ్, అశోక్ చందర్ విద్యార్థులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్‌లో..

దరఖాస్తు చేసుకోవాలి

రెబ్బెన: పదవీ విరమణ పొంది ఇప్పటి వరకు సీపీఆర్‌ఎంఎస్ హెల్త్ కార్డు లేని విశ్రాంత ఉద్యోగులు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలి పా రు. ఏరియాలో పదవీ విరమణ పొందిన ఉ ద్యోగులు ఆరోగ్య భద్రత కోసం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ సక్తి గల విశ్రాంత కార్మికులు ఈనెల 31 లోగా దరఖాస్తు ఫారాలు సంబంధిత గనులు, డిపార్టుమెంట్లలో అందజేయాలని సూచించారు.

ఇంటి పన్నుల వసూలుకు చర్యలు



పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శులు

కెరమెరి: మండల కేంద్రంలోని కెరమెరి గ్రామ పంచాయతీలో ఇంటిపన్నుల వసూలు తాత్సారంగా సాగుతున్న నేపథ్యంలో ఎంపీడీవో అంజద్‌పాషా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శి గణేశ్‌తో పాటు తరుణ్(సుర్దాపూర్), వాజిద్(సావర్‌ఖెడా), హరీశ్ (కెస్లాగూడ), శ్వేత(ఖైరీ) పంచాయతీ కార్యదర్శులను శనివారం వరకు తాత్కాలికంగా నియమించారు. కెరమెరిలో 70శాతం ఇంటిపన్నులు వసూలు కాగా ఈనెల 31 లోగా వందశాతం వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. కాగా సుల్తాన్‌గూడలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు పన్నులు వసూలు చేశారు.

జమిలీ ఎన్నికలపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: జమిలీ ఎన్నికలపైన ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జమిలీ ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. జమిలీ ఎన్నికల ప్రజాభిప్రాయ సేకరణలో మేధావులు, ప్రజలు, ఉద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, జిల్లా కోకన్వీనర్ వీరభద్రచారి, నాయకులు ప్రసాద్, కరణ్, సత్యనారాయణ, ప్రభాకర్, నారాయణ, నగేశ్, పురుషోత్తం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కౌటాల: కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌పై బండి సంజయ్ చేసిన నిరాధారమైన ఆరోపణలు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కేసీఆర్ ఉద్యమంతోనే స్వరాష్ట్రం సాధ్యమైందని, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు నాగపూరే బండు, ఆదే నాందేవ్, చారి గోవింద్‌రావు, రామయ్య, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పెండింగ్ చలాన్లు చెల్లించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న మోహన్ నాయక్

బెజ్జూర్: వాహనదారులు పెండింగ్ చల్లాను చెల్లించాలని ఏఎస్సై మోహన్ నాయక్ అన్నారు. బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ సూచనల మేరకు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించడంతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



కెరమెరి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని సాకడ గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. కానీ దాని చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో అటువైపు వెళ్లే పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో రక్తపరీక్షలు బంద్

- నెల రోజులుగా నిలిచిన సేవలు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, రోగులు
- ఎల్‌టీ, ఫార్మసిస్టును నియమించాలని డిమాండ్



నెల రోజులుగా తాళం వేసి ఉన్న ల్యాబ్



పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెంచికల్‌పేట్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు అధునాతన సేవలను అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో రోగులకు, గర్భిణులకు సేవలు అందడం లేదు. పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నెల రోజులుగా ల్యాబ్ టెక్నీషియన్ లేక పోవడంతో గర్భిణులు, రోగులు రక్తపరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో సంజీవనగర్, ఎల్లూర్, పెంచికల్‌పేట్, పాపన్‌పేట్, గూడెం ఉప కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సుమారు 80 మంది గర్భిణీలు ప్రతినెలా వైద్య పరీక్షలకు హాజరవుతున్నారు.

నెల రోజులుగా బంద్..

ఆరోగ్య కేంద్రంలో విధులను నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ గత నెల రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. దీంతో నెల రోజులుగా ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, గర్భిణులు రక్త పరీక్షల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెంచికల్‌పేట్ మండలంలో రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్ లేనందున దహెగాం, బెజ్జూర్, కాగజ్‌నగర్ పట్టణాలకు పరీక్షల కోసం వెళ్తున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే రోగులు, గర్భిణులు సుమారు 80 కిలోమీటర్లు ప్రయాణించి రక్తపరీక్షల కోసం కాగజ్‌నగర్ ప ట్టణానికి అవస్థలు పడుతూ చేరుకుంటున్నారు. ప్రైవేటు ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలకు సుమారు రూ.700 నుంచి రూ.800 చెల్లించి పరీక్షలను చేయించుకుంటున్నారు. మరోవైపు ఇటీవల ఫార్మసిస్ట్ సైతం బదిలీ కావడంతో మందులు ఇచ్చే వారు లేక వైద్యం అరకొరగా అందుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులను నియమించాలని కోరుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి



నెలవారీ పరీక్షల కోసం పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నాం. ల్యాబ్ టెక్నీషియన్ లేనందున రక్త పరీక్షలు చేయడం లేదు. తప్పని పరిస్థితుల్లో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుంటున్నా. అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి.

– మౌనిక, గర్భిణి, పాపన్‌పేట్

గేదెను ఢీకొన్న బైక్



ఘటన స్థలంలో తీవ్ర గాయాలైన భీంరావు

బెజ్జూర్: మండలంలోని సోమిని గ్రామానికి చెందిన మడే భీంరావు బైక్‌పై వెళ్తూ మండల కేంద్రం సమీపంలోని నాగులమ్మ వద్ద గేదెను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి సహకరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: వెనుకబడిన ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి సహకరించాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ కోరారు. మంగళవారం మండల పర్యటనకు వచ్చిన కేంద్ర బృందం ప్రతినిధులు మత్యుంజయ ఝా, శుభోద్ కుమార్ తోపాటు కలెక్టర్ రాజర్షి షాలకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు, ఇక్కడి పరిస్థితులను వారికి వివరించారు. జిల్లాలోని వెనుకబడిన మండలమైన నార్నూర్‌లో ప్రభుత్వ డిగ్రీ, సాంఘిక సంక్షేమ, మైనార్టీ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సాగునీటి కోసం ఏంపల్లి, కొలందరి ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పూర్తిస్థాయి వైద్యులు నియమించాలని కోరారు. ఇందుకు కేంద్ర బందం ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, మాజీ జెడ్పీటీసీ బిర్జు లాల్, షేక్ దాదేఅలీ, జాదవ్‌రెడ్డి నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ యువ నాయకుడు మహేందర్ ఉన్నారు.

29న వారసంత వేలం

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ వారసంత వేలం ఈనెల 29న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తుకారాం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని పేర్కొన్నారు. రూ.5వేలు డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలం దక్కించుకున్న వారు 50శాతం డబ్బును గ్రామపంచాయతీకి వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నిర్ణయించిన ధరలను వారసంతలో వసూలు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాపూర్ వెంకన్న గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రెబ్బెన: జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి గాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి ఆలయం ఎదుట నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.